

బకాయిల భారం

అప్పుల ఊబిలో పంచాయతీలు.. ఎక్కడి పనులు అక్కడే

ఉమ్మడి జిల్లాలో రూ. 100 కోట్లకుపైగా పేరుకుపోయిన పెండింగ్ బిల్లులు



పంచాయతీలు ఆర్థిక భారంతో సతమతమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. బకాయిలు ఎక్కడిక్కడే పేరుకుపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. కొన్నిచోట్ల పారిశుధ్య పనులు కూడా చేపట్టే స్థితిలో పంచాయతీలు లేవు. బకాయిల విడుదల కోసం మాజీ సర్పంచ్‌లు ఇటీవల రోడ్డెక్కి ఆందోళనలూ చేపట్టారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకుంటే పారిశుధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు లేక పల్లెలు మరింత అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉంది. గత జనవరిలో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం నుంచి పాత బకాయిలు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. పాత పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘ నిధులు కూడా సక్రమంగా విడుదల కావడం లేదు. గ్రామ పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పన్నులు వసూలు కాకపోవడంతో

మిగతా 7వ పేజీలో...

విడుదలైంది కొంతే..

బకాయిలపై మాజీ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ఆటంకం కలగడంతో ఇటీవల ప్రభుత్వం కొన్ని నిధులు విడుదల చేసింది. దీంతో పారిశుధ్య కార్మికుల జీతాలు కొంత వరకు చెల్లించారు. అలాగే ట్రాక్టర్ల ఈఎంఐలు కూడా కొన్ని గ్రామాలకు విడుదలయ్యాయి. అయితే దీంతో కష్టాలు ఏమీ తీరలేదు.



పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ఆదిలక్ష్మి

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

ఆమనగల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తి విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆమనగల్లు ఏడీఏ ఆదిలక్ష్మి కోరారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గేటు సమీపంలోని శ్రీఅభిషేక్ కాటన్‌మిల్లును శుక్రవారం ఏడీఏ సందర్శించారు. మిల్లులోని పత్తి కొనుగోళ్లను ఆమె పరిశీలించారు. విక్రయానికి తెచ్చిన పత్తి తేమ శాతాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఆమనగల్లు సబ్ డివిజన్ పరిధిలో మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఐ కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మణ్ రావు, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, 16వ వార్డు కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఎంఎస్ నటరాజ్ ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం కమిషనర్ వెంకన్నకు రాజీనామా పత్రాన్ని ఇచ్చారు. వ్యక్తిగత కారణాలతో తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక ముందు సాధారణ బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతానని తెలిపారు. మరో రెండు నెలల పదవీ కాలం ఉండగానే వైస్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేయడానికి బలమైన కారణం ఉంటుందన్న చర్చ మున్సిపాలిటీ కొనసాగుతోంది.



ఆంజనేయస్వామి విగ్రహానికి హారతి ఇస్తున్న చిన జీయర్‌స్వామి

భగవంతుడు సర్వాంతర్యామి

శంకర్‌పల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పౌరుషం, కార్యసిద్ధి, బుద్ధిబలంతో ముందుకు సాగాలనిత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురంలో నూతనంగా నిర్మించిన మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం రాత్రి హాజరయ్యారు. ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఆధునిక జీవన విధానంలో రోగాలను కొని తెచ్చుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుండలు, రాగి పాత్రలలోనే ఆహారాన్ని వండుకొనిన భుజించాలని సూచించారు. భగవంతుడు సర్వాంతర్యామి అని, ఆయన అన్ని రూపాలలో ఉంటాడని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో భగవంతునికి దగ్గర కావాలని అన్నారు. ఈ ప్రాంతం రామరాజ్యంగా వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



మొక్కలు నాటుతున్న జగద్గురు శంకరాచార్య

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

- ఉత్తరాఖండ్ రాజరాజేశ్వరీ ఆశ్రమ స్వామీజీ జగద్గురు శంకరాచార్య

కడ్తాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొక్కల పెంపకంపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని ఉత్తరాఖండ్ రాజరాజేశ్వరీ ఆశ్రమ స్వామీజీ జగద్గురు శంకరాచార్య అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ది ఎర్త్ సెంటర్‌ను శుక్రవారం స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్తరాఖండ్ పీఠాధిపతులు సరస్వతీ, ప్రకాష్, నంద, ఆన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, సీజీఆర్ ప్రతినిధులు తదితరులున్నారు.

మురుగుతో విద్యార్థుల ఇక్కట్లు



- నానక్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద లోపించిన పారిశుధ్యం
- మురుగు నీరు పారుతుండటంతో నానా ఇబ్బందులు
- కంపు కొడుతున్న పరిసరాలు.. పట్టని అధికారులు

8

గూడు గోస తీరేదెన్నడో?



- డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో రాజకీయం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వంద మందికి ఇళ్ల కేటాయింపు
- అనర్హులకు ఇచ్చారని కాంగ్రెస్ ఆరోపణ
- విచారణ చేసి అర్హులను ఎంపిక చేస్తామంటున్న ప్రభుత్వం

7

ఇంటింటి సర్వేతో సమగ్ర ప్రణాళిక

- లోటుపాట్లు లేకుండా సర్వే చేపట్టాలి
- హాజిపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్/ షాద్‌నగర్ రూరల్ నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సర్వేతో సమగ్ర ప్రణాళిక రూపొందించేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామంలో ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే వల్ల బడుగు, బలహీన వర్గాలతో పాటు ఆయా పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రతి ఇంటిలోని వ్యక్తుల సమాచారాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. శుక్రవారంతో మొదటి విడత సర్వే పూర్తవుతుందని, వెంటనే రెండో విడత సర్వే చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యులను కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కింద వచ్చే నిధులను పూర్తి స్థాయిలో పేదలకు వినియోగించాలన్నారు. అలాగే ఆస్పత్రి డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఎమర్జెన్సీ సమయంలో వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. రోగ నిర్ధారణ శాంపిల్స్‌ను తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపించాలన్నారు.

కాన్పుల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో కనీసం 300 కాన్పులు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆస్పత్రిని మరింత విస్తృతపరిచి అన్ని వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి ఆవరణ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉందని వైద్యులు చెప్పడంతో వెంటనే షాద్‌నగర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు ఫోన్ చేసి ప్రతి మూడు రోజులకు ఒకసారి ఆస్పత్రి ఆవరణను మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో ఓపీ సేవలు, డయాలసిస్ సెంటర్, రోగుల పట్టికను పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు షాద్‌నగర్ ఆర్డీవో సరిత, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

రంగారెడ్డి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ నారాయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి ఒకటో తేది నాటికి 18 సంవత్సరాలు వయసు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ప్రత్యేక క్యాంపును ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బూత్ లెవెల్ అధికారులు తమ కార్యాలయాల్లో 9, 10 తేదీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. కొత్తగా ఓటర్లు నమోదుతో పాటు, ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

హిందూ దేవాలయాలకు రక్షణ కరువు

- నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

శంషాబాద్, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ మున్సిపాలిటీ ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలోని హనుమాన్ దేవాలయంలో ఉన్న నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేసిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులు గడిచినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని, ఇదిపూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. విగ్రహాలు ధ్వంసమైన ప్రాంతాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హిందువుల మనోభావాలు దెబ్బతీయడానికే నవగ్రహాలను ఒక ప్లాన్ ప్రకారం ధ్వంసం చేశారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేవాలయాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. దాడులపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని మండిపడ్డారు. అక్టోబర్ 14న సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి, అక్టోబర్ 12న నాంపల్లిలోని దుర్గామాత

మిగతా 8వ పేజీలో...



ధ్వంసం చేసిన విగ్రహాలను పరిశీలిస్తున్న బండి సంజయ్

కట్టమైసమ్మ ఆలయంలో త్రిశూలం ధ్వంసం

- దుండగుడికి దేహశుద్ధి .. పోలీసులకు అప్పగింత
- శంషాబాద్ సిద్ధాంతి బస్తీలో ఘటన

8



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

షాద్‌నగర్‌రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మొదటి సంవత్సరం నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం సోలీపూర్ శివారులోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. గత ఏడాది ఫలితాలను కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెస్, డైనింగ్ హాల్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, స్టోర్ రూంలోని సరుకులను పరిశీలించారు. అలాగే తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా, అధ్యాపకులు ఉన్నారు.



కీసరగుట్టలో దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా దీపోత్సవం

కీసర, నవంబరు,8(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో దీపోత్సవం కనుల పండువగా జరిగింది. కార్తీకమాసోత్సవంలో భాగంగా ప్రతి నిత్యం ప్రదోష కాలంలో దీపోత్సవం నిర్వహించాలని దేవాదాయ ఉన్నత అధికారులు ఆదేశించినట్లు ఈవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్వామివారికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించారు. భక్తుల దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు మట్టి ప్రమీదలు, నూనె, వత్తులు, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కను ఉచితంగా అందజేశారు.

హిందూ ధర్మంపై ఇన్ని కుట్రలా?



మాట్లాడుతున్న హిందూ యాక్టివిస్ట్ సుబ్బలక్ష్మి

వికారాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం కోసం పోరాటం చేసే వారిపై రోజురోజుకు కుట్రలు అధికమవుతున్నాయని హిందూ యాక్టివిస్ట్ సుబ్బలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతగిరి వచ్చిన ఆమె శుక్రవారం అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయం వద్ద జరిగే జాతరలో హిందువులకు షాపులు ఇవ్వకుండా అన్యమతస్తులకు ఇవ్వడంపై మండిపడ్డారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారులు, సిబ్బంది వెంటనే పరిష్కరించాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. యాలాల తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ధరణి, కల్యాణలక్ష్మి ఫైల్‌లను పరిశీలించారు. రికార్డు గదిని తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తహసీల్దార్ అంజయ్యను ఆదేశించారు.

రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తాం



రాజేందర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్/చేవెళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోదరుడు, దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల, షాబాద్‌లో రాజేందర్‌రెడ్డి జయంతిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పట్నం అవినాష్‌రెడ్డి, కోట్ల మహేందర్‌రెడ్డి లతో కలిసి ఘనంగా నిర్వహించారు. రాజేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ షాబాద్, చేవెళ్ల, మండలాధ్యక్షులు నర్సింగ్‌రావు, ప్రభాకర్, కాంగ్రెస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీరాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చాంద్‌పాషా, విశ్వం, ఇమ్రాన్, ముక్రమ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి



ప్రకటనను విడుదల చేస్తున్న నాయకులు

యాచారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మించతలపెట్టిన ఫార్మాసిటీని తక్షణమే రద్దు చేయాలని, భూసేకరణ చేయరాదని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు కవుల సరస్వతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన మాటను నేడు అధికారంలోకి రాగానే విస్మరించడం దారుణమని అన్నారు. ఈ మేరకు శుక్రవారం యాచారంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు విలేకరులకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతకుముం దు కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో కవుల సరస్వతి మాట్లాడుతూ మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటి రద్దు చేయడంతో పాటు భూసేకరణ చేయబోమని కాంగ్రెస్ నాయకులు రైతులకు ఇచ్చిన మాటను నేడు ఎందుకు విస్మరించడం దారుణమన్నారు. నాయకులు డాక్టర్ నిరంజన్, బైకని మల్లేష్, నారాయణ, మహిపాల్‌రెడ్డి, బర్ల మల్లేష్ తదితరులున్నారు.

సేవలను బట్టే సమాజంలో కీర్తి



రాములును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సేవాభావం, దాతృత్వాన్ని బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో శుక్రవారం ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కాంగ్రెస్ పార్టీ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శిబిరం నిర్వాహకుడు మండ్లీ రాములు, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, పీసీసీ కిసాన్ సెల్‌రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి సోదరుడు మనోహర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి లతో కలిసి రాంరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. 120 మంది రక్తదానం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బీచ్యానాయక్, వస్పుల మానయ్య, మోతీలాల్‌నాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, జిల్లా, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో పీఆర్సీని అమలు చేయాలి



మాట్లాడుతున్న సదానందంగౌడ్

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సదానందంగౌడ్, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర కోశాధికారి సైదయ్య, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవి, రామసుబ్బారావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూపాల్, ఏఐఎస్టీఎఫ్ సభ్యులు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పరమేశ్వర్, కార్యదర్శులు సుధాకర్, జిల్లా కోశాధికారి బాల్‌నర్సింహులు, నాగర్‌కర్నూల్ జిల్లా బాధ్యులు సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇఫ్తాకార్, ఆమనగల్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, నవీన్‌కుమార్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూడు గోస తీరేదెన్నడో?

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో రాజకీయం

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వంద మందికి ఇళ్ల కేటాయింపు
- అనర్హులకు ఇచ్చారని కాంగ్రెస్ ఆరోపణ
- విచారణ చేసి అర్హులను ఎంపిక చేస్తామంటున్న ప్రభుత్వం
- ఇళ్లు పొందినవారిలో మొదలైన గుబులు



నందిగామలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

నందిగామ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నందిగామ మండలంలో పేదల సొంతింటి కల ఇప్పట్లో నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం ఎక్కువైందనే విమర్శలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తుంది. నిజనిర్ధారణ కమిటీ ద్వారా అక్రమాల నిగ్గు తేల్చిన తర్వాతనే అర్హులకు ఇళ్లు కేటాయిస్తామంటోంది. దీంతో ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇళ్లు పొందినవారిలో ఆందోళన మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికి ఇళ్లు ఇస్తుందోనని ఆవేదన చెందుతున్నారు. నందిగామ మండల కేంద్రంలో 120 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సుమారు రూ.6 కోట్లతో జీప్లస్2 పద్ధతిలో వీటిని నిర్మించారు. 2020లో ప్రారంభించి 2023లో నిర్మాణ పనులు పూర్తి చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 408 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతగా 100 మందికి ఇళ్లను కేటాయించారు. మిగతా 20 ఇళ్లను దరఖాస్తులు పరిశీలించి కేటాయిస్తామని అధికారులు చెప్పారు. అప్పటి ప్రజాప్రతినిధులు హడావుడిగా కార్యక్రమం నిర్వహించి వందమంది లబ్ధిదారులకు ఇంటి నంబర్లను సైతం కేటాయించారు. ఆ సమయంలో 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో గృహ ప్రవేశాలు ఆగిపోయాయి.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే నందిగామ మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని, అసలైన అర్హులను గుర్తించి పంపిణీ చేస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో అలజడి మొదలైంది. అంతేకాకుండా ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులను గుర్తించి వెంటనే ఇళ్లను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇటీవల నందిగామలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత కలెక్టర్ శశాంక, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ చేయిస్తామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే గారూ.. ఇళ్లు ఇచ్చి ఆదుకోండి



మాది నిరుపేద కుటుంబం. గత ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం కేటాయించి ఇంటి నెంబరు సైతం ఇచ్చింది. కానీ ఎన్నికలు రావడంతో ఇళ్లను కేటాయించలేదు. ఎమ్మెల్యే గారూ.. త్వరగా ఇళ్లు ఇచ్చి ఆదుకోండి.

- సోమ గీత, లబ్ధిదారురాలు, నందిగామ

ఇంటి అద్దె కట్టలేకపోతున్నం



కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా విచారణ చేపట్టి మా లాంటి పేద వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలి. అద్దె కట్టలేకపోతున్నం. పిల్లల చదువుకూ ఇబ్బంది పడుతున్నాం. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఆదుకోండి.

- రామంజపురం మమత, లబ్ధిదారురాలు, నందిగామ

బకాయిల భారం

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక ఇబ్బందులు మరింత పెరిగాయి. వసూలైన పన్నులు కూడా పాత బకాయిలు చెల్లించడానికి కూడా సరిపోవడం లేదు. ఖజానా ఖాళీ కావడంతో దాదాపు అన్ని గ్రామ పంచాయతీలు నిధులకు కటకటలాడుతున్నాయి.

రూ. 100 కోట్లకు పైగా..

ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ. 100 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో గత సర్పంచ్‌ల హయాంలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.37 కోట్ల వరకు ఉన్నాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో రూ.35 కోట్లు , మేడ్చల్ జిల్లాలో రూ.8 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఇవికాక ట్రాక్టర్ల ఈఎంఐలు రూ. కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీలే స్వయంగా పారిశుధ్య పనులు చేపట్టేందుకు గతం ప్రభుత్వం రుణాల మీద ట్రాక్టర్లు అందచేసింది. ప్రతి నెలా ఈఎంఐల రూపంలో ఈ రుణాలను బ్యాంకులకు చెల్లించే విధంగా ఏర్పాట్లు చేసింది. అయితే ఈ ట్రాక్టర్లకు సంబంధించిన ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ. 15 కోట్ల వరకు ట్రాక్టర్ల బకాయిలు ఉన్నాయి. అలాగే డీజిల్ బిల్లులకు సంబంధించిన బకాయిలు కూడా రూ. కోట్లలో పెండింగ్‌లు ఉన్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కూడా సరిగా నిధులు జమచేయకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల జీతాలు, బోర్లు, విద్యుత్ దీపాలు, పంచాయతీ కార్యాలయాల నిర్వహణతో పాటు ఇతర మరమ్మతు పనులకు అవసరమైన నిధులు అందుబాటులో లేవు.

ఒక్కో పంచాయతీలో రూ.లక్షల్లో బకాయిలు

ఉమ్మడి జిల్లాలో పాలనాకాలం ముగిసే సమయానికి సర్పంచ్‌లు ఎడాపెడా పనులు చేపట్టి పంచాయతీలను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో ప్రస్తుతం పారిశుధ్య సిబ్బంది జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అలాగే మరమ్మతు పనులు కూడా జరగడం లేదు. ప్రత్యేకాధికారుల పాలనలోకి వచ్చి దాదాపు 10నెలలు అవుతున్నా పంచాయతీల్లో సమస్యలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. పాత బకాయిలు రూ. లక్షల్లో పేరుకుపోవడమే దీనికి కారణం. ఒక్కో గ్రామ పంచాయతీలో రూ. లక్ష నుంచి 5లక్షల వరకు బకాయిలు ఉండడం గమనార్హం. కొన్ని చోట్ల రూ.10లక్షలకుపైగానే బకాయిలు ఉన్నాయి. నగర శివార్లలోని కొన్ని గ్రామాల్లో రూ. 20లక్షల వరకు బకాయిలు ఉండడం గమనార్హం. దీంతో గ్రామాల్లో అత్యవసర పనులకు నిధులు కొరత ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో గ్రామ కార్యదర్శులు అత్యవసర పనుల కోసం నిధులు సర్దుబాటు చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డికి మల్‌రెడ్డి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సీఎంను కలిసి పండ్లబుట్టను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కుటుంబ సర్వేలో సైబర్ మోసాలకు అవకాశం



నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ

వికారాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వే చేస్తున్నామని ఫ్రాడ్ లింక్స్ పంపిస్తున్న సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ లింక్ క్లిక్‌చేస్తే వారి ఖాతాల్లో ఉన్న డబ్బులు మాయం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరి కొందరు కుటుంబ సర్వే ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ ఫోన్ చేసి అడుగుతుంటారన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అధ్యాపకుడు శ్రావణ్ కుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పొందిన శ్రావణ్‌కుమార్

ఘట్‌కేసర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు జి.శ్రావణ్ కుమార్ డాక్టరేట్‌ను సాధించారు. క్లౌడ్ పరికరాల కోసం మెరుగుపరిచిన చిపర్ టెక్స్ పాలసీ అట్రిబ్యూట్ - ఆధారిత ఎన్‌క్రిప్షన్‌పై ప్రొఫెసర్ డాక్టర్ ఎకృష్ణ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఐటీ ఆర్‌వీఆర్, జేసీ ఇంజనీరింగ్ కళాశాల పర్యవేక్షణలో జరిపిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. శ్రావణ్ కుమార్‌ను కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కె.రామేశ్వరయ్య అభినందించారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

అటవీ పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్



సమావేశంలో మాట్లాడుతూన్న అహ్మద్ నదీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు అహ్మద్ నదీమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎన్ని కల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ముసాయిదా విడు దల చేశారన్నారు. ఆ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందన్నారు. డిసెంబర్ 24న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కరిస్తారని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న తుదిజాబితా ప్రకటించి, జనవరి 6న విడుదల చేస్తార న్నారు. అపోహలు లేకుండా ఓటరు జాబితా తయారీలో పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జనవరి 1, 2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారా యణరెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్‌అలీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, అజయ్ కుమార్, నాయకులు రాజేష్‌కుమార్, నంద కుమార్ మమ్మద్ సొహెల్, శ్రీనివాస్, ఖాజా మొయినుద్దీన్, కొల్లూరు పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్కోటిక్ డీసీపీ సీతారామ్, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మాదకద్రవ్యాల మాఫియాతో జాగ్రత్త

మేడ్చల్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల మాఫియాతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ నార్కోటిక్ డీసీపీ సీతారామ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం నార్కోటిక్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ సీతారామ్ మాట్లాడుతూ.. కళాశాల ప్రాంగణంలో ఎవరైనా వ్యక్తులు మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని తోటి విద్యార్థులు సముదాయించి వాటికి దూరంగా ఉంచాలన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించే వారి ఆటకట్టించడానికి విద్యార్థులు పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి విద్యార్థులు తమవంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. లైంగికదాడులు, సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, నార్కోటిక్ ఏసీపీలు హరీశ్‌చంద్ర, సుబ్బరామిరెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవన

వికారాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవన అన్నారు. ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, పీహెచ్‌సీల వైద్యాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీ వైద్యాధికారుల పనితీరు ఆధారంగానే అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు సాధ్యమన్నారు. వైద్యాధికారులలుందరూ సమయ పాలన పాటించి విధులు హాజరు కావాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, మాత శిశు సంరక్షణ సేవలు, కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా నివారణ, కుష్టు మలేరియా, హెచ్‌ఐవీ వంటి అంటు వ్యాధుల నివారణ, నియంత్రణ నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణ కొరకు నిరంతరం స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ఆపరేషన్‌లను చేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. స్లాబ్ లీకేజీలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి త్వరలో నిధులు విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ జీవరాజు, డాక్టర్ రవీంద్రయాదవ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నేహా, డాక్టర్ నిరోషా, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగ మల్లేశ్వర రావు,ఆఫీస్ సూపరింటెండెంట్ నర్సింహులు పాల్గొన్నారు.

కర్ణాటక పోలీసులకు చిక్కిన హత్య కేసు నిందితుడు



ప్రధాన నిందితుడు అంకుర్ రాణా(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రియల్‌వ్యాపారి రమేష్‌కుమార్ హత్యకేసు కస్టడీ నుంచి తప్పించుకున్న ప్రధాన నిందితుడు అంకుర్‌రాణా ఎట్టకేలకు కర్ణాటక పోలీసులకు చిక్కాడు. గతనెల 4వ తేదీన రమేష్‌కుమార్‌ను ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి హెచ్‌పీసీఎల్ సమీపంలో హత్యచేసి కర్ణాటక, కొడుగు జిల్లా, సొంటికుప్పలోని ఓ కాఫీ తోటలో కాల్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీసీపుటేజీల ఆధారంగా నిందితులు నిహారిక, అంకుర్ రాణా, నిఖిల్‌రెడ్డిలను అదేనెల 8వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం అనుమతితో కర్ణాటక పోలీసులు ఎస్కార్ట్ వాహనంలో రెండురోజుల కోసం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి గతనెల 28వ తేదీన పోచారం పోలీసుస్టేషన్‌కు నిహారికతో పాటు అంకుర్ రాణాలను పోచారం పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం హత్య జరిగిన ప్రదేశానికి తీసుకొచ్చి వివరాలు సేకరించారు. అక్కడి నుంచి రమేష్ కుమార్ సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్‌కు తీసుకొచ్చి అక్కడ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. రాత్రి కావడంతో చౌదరిగూడ, విజయపురి కాలనిలోని బృందావన్‌లో లాడ్జీలో భోజనం చేసి అక్కడే బసచేశారు. మరుసటి రోజు అంకుర్ రాణా పోలీసుల కళ్లుగప్పి కానిస్టేబుల్ ఫోన్ తీసుకొని లాడ్జి నుంచి తప్పించుకొని పారిపోయాడు. అక్కడి నుంచి రాణా సికింద్రాబాద్‌కు చేరుకొని రైల్లో హర్యానాకు వెళ్లాడు. కర్ణాటక పోలీసులు పోచారం ఐటీసీ పోలీసు స్టేషన్‌లో అంకుర్‌రాణా తప్పించుకున్నాడని ఫిర్యాదు చేశారు. కర్ణాటక, పోచారం పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి ఐదు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి రాణాను రాజస్థాన్‌లోని కోట ప్రాంతంలో ఈనెల 6వ తేదీన కర్ణాటక పోలీసులకు దొరికాడు. మరునటి రోజు రాణాను న్యాయస్థానంలో హాజరుపరిచారు. రాణా దొరికిన విషయాన్ని కొడుగు సీఐ మహాదేవ్ శుక్రవారం సమాచారం ఇచ్చినట్లు పోచారం ఐటీసీ సీఐ రాజువర్మకు తెలిపాడు. రమేష్ కుమార్ హత్య కేసు త్వరలో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు బదిలీచేసే అవకాశం ఉన్నట్లు చెప్పారు.

20 కిలోల క్లోరల్‌హైడ్రేట్ పట్టివేత



క్లోరల్ హైడ్రేట్ కెమికల్‌ను తరలిస్తూ పట్టుబడిన నిందితులు

కొడంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు తయారీకి ఉపయోగించే 20 కేజీల క్లోరల్ హైడ్రేట్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బషీరాబాద్ మండలానికి చెందిన అంబర్‌పేట్ శ్రీకాంత్‌గౌడ్ కల్తీకల్లు తయారీకి ఉపయోగించే పది కిల్లో క్లోరల్ హైడ్రేట్‌ను కర్ణాటక నుంచి తీసుకొస్తున్నారు. గురువారం రాత్రి కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కొడంగల్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్విఫ్ట్ కారును తనిఖీ చేయగా 10కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా కర్ణాటక రాష్ట్రం చించోలికి చెందిన మేఘనాథ్ గౌడ్ దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో మేఘనాథ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతడు చితాపూర్‌కు చెందిన ఉష్ణయ్యగౌడ్ దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో మేఘనాథ్‌గౌడ్ దగ్గరి నుంచి 5 కేజీలు, ఉష్ణయ్య గౌడ్ దగ్గరి నుంచి 5కేజీలు క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన క్లోరల్ హైడ్రేట్ విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కల్తీ కల్లు తయారీ, గంజాయి లాంటి మత్తు పదార్థాల వ్యాపారం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మురుగు.. విద్యార్థుల ఇక్కట్లు



కొందుర్గు: రేగడి చిల్కమర్రి గ్రామ శివారులో డిజిటల్ సర్వే చేస్తున్న సభ్యులు

రింగ్‌రైల్వే ఏర్పాటుకు ఏరియల్ సర్వే

చౌదరిగూడ,నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా కొందుర్గు మండలంలో రింగ్ రైల్వే నిర్మాణం కోసం శుక్రవారం ఏరియల్ సర్వే చేపట్టారు. కొందుర్గు మండల పరిధిలోని రేగడిచిల్కమర్రి గ్రామశివారు నుంచి ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా ఈ సర్వే జరిగింది. కాగా, ఈ సర్వేను ఆర్బీ అసోసియేషన్ ఏజెన్సీ బృందం సభ్యులు షాటిలైట్ ద్వారా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన భూముల సర్వేనంబర్లను వారు గుర్తించారు. హెలికాఫ్టర్ సహాయంతో డిజిటల్ సర్వే చేపట్టినట్లు సమాచారం.

- నానక్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద లోపించిన పారిశుధ్యం
- మురుగు నీరు పారుతుండటంతో నానా ఇబ్బందులు
- కంపు కొడుతున్న పరిసరాలు.. పట్టని అధికారులు



పాఠశాల ప్రహరీకి ఆనుకొని పారుతున్న మురుగు



నానక్‌నగర్ పాఠశాల ఎదుట నిలిచిన మురుగు..

యాచారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నానక్‌నగర్‌లో మురుగు నీరు రాజ్యమేలుతోంది. గ్రామంలోని ఏ బస్తీలో చూసినా మురుగు నీరు రోడ్లపై పారుతోంది. గ్రామానికి ఆనుకొని ఉన్న పంట పొలాల రైతులు మురుగు నీటిని పంట పొలాలకు రాకుండా అడ్డు కట్ట వేయడంతో రోడ్లపై పారుతోంది. దాంతో జనం బేజారవుతున్నారు. గ్రామంలో పగటివేళ దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందుల పాలవుతున్నారు. కాగా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కనే మురుగు నిలిచిపోవడంతో పాటు పాఠశాల ముందు నుంచీ పారుతుండడంతో దోమలకు నిలయంగా మారిందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పలు వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీవో శ్రీలతతో ప్రస్తావించగా గ్రామానికి ఆనుకొని ఉన్న పంటపొలాల్లోకి మురుగు నీరు వెళ్లకుండా రైతులు అడ్డు కట్ట వేయడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. మాజీ సర్పంచులతో మాట్లాడి భారీ ఇంకుడుగుంత నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మండల మత్స్యకార సంఘం నాయకులు ఎడ్ల ఉమాకాంత్(28) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కందుకూరు గ్రామానికి చెందిన ఆయన చేపలు పట్టడానికి ఉపయోగించే వలను కొనడానికి ఈనెల 3న నగరంలోని సికింద్రాబాద్ మార్కెట్‌కు వెళ్లాడు. అదే రోజు తిరిగి స్వగ్రామం వస్తుండగా బోయిన్‌పల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే ఓవైసీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

కడ్తాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కులవృత్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బావండ్ల ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులతో శుక్రవారం ఆనంద్ సమావేశమయ్యారు. వారి సమస్యల గురించి అడిగి తెలుసుకొని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆనంద్ రూ.50వేల విరాళం అందజేశారు. సంఘ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో నాయిబ్రహ్మణ సంఘ నాయకులు కానుగుల అంజయ్య, రాజు, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీను, శివ, ధోనీ, గోపాల్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు చేయరా?

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు మొదలై 20 రోజులు దాటినా ధాన్యం కొనుగోళ్లు ఇంకా మొదలు పెట్టలేదని ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ధాన్యం కుప్పలు పోసుకుని కళ్లాల దగ్గర పడిగాపులు గాస్తున్నా.. పట్టించుకునేవారు లేరంటూ మండి పడ్డారు. రెండ్రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మొక్కుబడిగా ప్రారంభించినా.. నేటికీ ఒక్క గింజకూడా కొనలేదని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించకపోవడంతో కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయన్నారు. రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు లంకె పెట్టడంతో వారు ధాన్యం తీసుకెళ్లడానికి ముందుకురావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరోనా సమయంలో కూడా గ్రామాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు మేలు చేయడానికి, రూ.500 బోనస్ ఎగ్గొట్టడానికే ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ధ్వజమెత్తారు. సోమవారంలోగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకుంటే రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం, మంచాల మండల అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్‌లు ఉన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు



షాద్‌నగర్‌అర్బన్ : ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



మహేశ్వరం : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

షాద్‌నగర్‌అర్బన్/కొత్తూరు/కేశంపేట/షాబాద్/మహేశ్వరం/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్/మాడ్గుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి దక్షతతో తెలంగాణ మోడల్ రాష్ట్రంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధీమా వ్యక్తం చేశారు. షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులకు తినిపించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వేంకటేశ్వరాలయంలో రేవంత్‌రెడ్డి పేరున అర్చన చేయించి పూజ చేశారు. నవోదయ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేసి, వారి పోషణ కోసం రూ.50వేల చెక్కును ఇచ్చారు. చటాన్‌పల్లి శివారులోని ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్ ఆశ్రమంలోని కేశంపేట మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విశాలశ్రవణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు వై.యాదయ్యయాదవ్, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, అగ్గనూరి విశ్వం, బాబర్‌ఖాన్, జి. బాల్‌రాజ్ గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, సి.శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, చిట్టెం దామోదర్‌రెడ్డి, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కొత్తూర్ మున్సిపాలిటీ శాఖ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. పెంజర్ల రోడ్డులోని బందోనిమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలికల వసతి గృహంలో విద్యార్థినీల చేత కేక్ కట్‌చేయించి, పండ్లు బిస్కట్లు పంచి పెట్టారు. నాయకులు ఇందూరి శ్రీనివాస్, జెనిగె జగన్, కర్రోళ్ల సురేందర్, కమ్మరి జనార్దన్ చారి, ఎమ్మె సత్తయ్య, నవీన్‌చారి, రమేష్, చిలకమర్రి నర్సింహ్మా, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండల కేంద్రంలో రేవంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలిపారు. యెన్నం శ్రీధర్ రెడ్డి, రూప్లానాయక్, కరుణకార్ రెడ్డి, గిరిధర్ యాదవ్, తైద పర్వతాలు, అనసూయమ్మ, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, విజయరెడ్డి, రాంచంద్రయ్య, వెంకటయ్య తదితరులున్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళా అధ్యక్షురాలు అశ్విని, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, వెంకటొరెడ్డి, అశోక్, మాజీ సర్పంచులు రవీందర్‌నాయక్, నర్సింహులు, నాయకులు రాంరెడ్డి, కుద్దూస్, రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జానీ, వెంకటొరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, శేఖర్, రాఘవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. మహేశ్వరం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ శ్రేణులు రేవంత్‌రెడ్డి జన్మదినం జరుపుకున్నారు. తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కేక్ కట్‌చేశారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, సత్యనారాయణ, పాండురంగారెడ్డి, అల్లె కుమార్, లాజర్, రాజు నాయక్, సమత, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలో రేవంత్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట నిర్వహించారు. కార్యక్రమానికి పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీక్యనాయక్, జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి సోదరుడు మనోహర్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్‌చైర్మన్ కేశవులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండ్లీ రాములు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బీచ్యనాయక్, మానయ్య, మోతిలాల్‌నాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, జిల్లా, మండలాల నాయకులు తదితరులున్నారు. కాగా, సేవాభావం, దాతృత్వాన్నిబట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కాంగ్రెస్ పార్టీ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే కడ్తాల మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా పేల్చారు. కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వేణుగోపాల్, లక్పతి నాయక్, శంకర్, మల్లేశ్‌గౌడ్, బ్రహ్మచారి, రామకృష్ణ, చేగూరి వెంకటేశ్, హీరాసింగ్, జహంగీర్‌బాబా, జవహర్‌లాల్ నాయక్, శంకర్ నాయక్, వెంకన్న, బుచ్చయ్య, గురిగళ్ల లక్ష్మయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో సీఎం జనద్మిన వేడుకలు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మోహన్ రెడ్డి, అంజయ్య, భగవాన్ రెడ్డి, అజీం, డిగ్రీకృష్ణ, డేవిడ్, జనార్ధన్, రమేశ్‌యాదవ్, చెన్నకేశవులు, ఆరిఫ్, రేణురెడ్డి, రఘురాము లు, శంకర్, శ్రీను, శేఖర్, తిరుపతి, తదితరులున్నారు. అలాగే మాడ్గుల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద రేవంత్‌రెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. మాజీ ఎంపీపీ జంగయ్య, ఎంపీటీసీ పాండుగౌడ్, రేవంత్‌రెడ్డి మిత్రమండలి అధ్యక్షుడు భాస్కర్, హుస్సేన్, గోవిందొరెడ్డి, నాయకులున్నారు.



ఆమనగల్లు : రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూదిని రాంరెడ్డి

గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి

తలకొండపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు పోరాటం ఉధృతం చేశారు. పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 8వ రోజుకు చేరాయి. దీక్షలో హమాలి సంఘం నాయకులు యాదయ్య, మల్లయ్య, రాములు, వెంకటయ్య, కృష్ణయ్య, మల్లయ్య, నిరంజన్, దాసు, మైసయ్యలుకూర్చున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటుకు అనుమతులివ్వొద్దు

- తహసీల్దార్‌కు వీరన్నపేట్ గ్రామస్తుల వినతి

చౌదరిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వీరన్నపేట్ గ్రామశివారులో ఏర్పాటు చేస్తున్న క్రషర్ మిషన్‌కు అనుమతులు ఇవ్వొద్దంటూ ఆ గ్రామస్తులు శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పద్మారం గ్రామశివారులోని సర్వేనంబర్ 185లో క్రషర్ మిషన్ ఏర్పాటు చేసేందుకు కొంత భూమిని చదును చేశారని తెలిపారు. పంటపొలాలు దెబ్బతింటాయని, క్రషర్ ఏర్పాటు అనుమతు ఇవ్వొద్దని తహసీల్దార్‌ను వేడుకున్నారు. యాదగిరి, యూసుఫ్, గౌస్, శివకుమార్, ఖదీర్, అంజి, కృష్ణ బాలయ్య తదతరులు వినతిపత్రం ఇచ్చారు.

వైద్యశిబిరం విజయవంతం



రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూర్‌లో ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామంలో ముచ్చింతల్‌కు చెందిన జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ప్రీడయాబెటిక్ స్క్రీనింగ్ చేశారు. డయాబెటిక్ రోగులకు ఉచితంగా మందులందజేశారు. మధుమేహం ఉన్న వారిని గుర్తించి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాఆహన కల్పించారు. 70మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రజ, డాక్టర్ విరాజిత, జిమ్స్ పీజీ డాక్టర్లతో పాటు పంచాయతీ కార్యదర్శి రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి



కమిటీ సభ్యులతో జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

చౌదరిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీల రాజ్యాధికారం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని బీసీసేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం బీసీసేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో కొందుర్గు మండల బీసీసేన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యత కోసమే కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కొందుర్గు మండల అధ్యక్షుడిగా చెక్కల చందు, ఉపాధ్యక్షుడిగా ఈసరి లింగం, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా మధు, కోశాధికారిగా నరేందర్, సభ్యులుగా శివకుమార్, మల్లేష్, రమేష్, నరేష్, రవిలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీసేన తాలుకా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహాచారి, శ్రీశైలం పాల్గొన్నారు.

రెండోరోజు ఘనంగా ఛట్ పూజ



పూజలో పాల్గొన్న ఉత్తర భారతీయులు

కొత్తూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతీయులు ఘనంగా నిర్వహించే ఛట్ పూజను మండల కేంద్రంలో రెండోరోజు శుక్రవారం జరుపుకున్నారు. పెంజర్ల రోడ్డులోని బందోని మైసమ్మ ఆలయ ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భారీ నీటితొట్టిని ఏర్పాటు చేయగా, బిహార్, యూపీకి చెందిన ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి భారీయెత్తున తరలి వచ్చి నీటిలో దిగి ఛట్‌పూజ నిర్వహించారు. సూర్యుడు అస్తమించిన తర్వాత, తిరిగి మరుసటిరోజు సూర్యుడు అస్తమించకముందు ఉపవాసదీక్షలతో ఛట్ పూజలు నిర్వహించారు. పూజా సామగ్రితో మహిళలు నీటిలో దిగి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, ఇందూరి శ్రీనివాస్, కమ్మరి జనార్ధన్‌చారి, జెనిగె జగన్, కర్రోళ్ల సురేందర్, అంజనేయులు, నర్సింహ, ఉదయ్‌శంకర్ తదితరులు ఛట్‌పూజలో పాల్గొని ఉత్తర భారతీయులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బిహారీలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్, శివాచారి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలకు రక్షణ కరువు

(5వ పేజీ తరువాయి)

గుడిపై, అక్టోబర్ 16న సదాశివపేటలోని గణేషుడి విగ్రహంపై దాడి జరిగిందన్నారు. మార్చి 24న చెంగిచెర్ల దేవాలయంపై దాడి జరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 10 నెలల్లో దాదాపు 100 దేవాలయాలకు పైగా దాడులు జరిగాయని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడ ఈ దాడులు జరిగాయని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన పుట్టిన రోజున యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ్మాస్వామిని దర్శించడం సంతోషకరమని, ఆయన ఇప్పటికైనా ఆలయాల పరిరక్షణపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయంపై దాడి జరగడంపై ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీ ప్రజల స్పందన బ్రహ్మాండంగా ఉందని బండిసంజయ్ అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డాక్టర్ ప్రేంరాజ్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, మల్లారెడ్డి, బుక్కగోపాల్, దేవేందర్, మహిపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే



కేశంపేట : సంగెంలో స్టిక్కర్లు వేస్తున్న అధికారులు

చౌదరిగూడ/కేశంపేట/ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపడుతున్నామని మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కొందుర్గు తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో అనురాధ, ఎంపీవోలు హన్మంత్‌రెడ్డి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో శుక్రవారంతో ఇంటింటికీ స్టిక్కరింగ్ పూర్తయినట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలో 13,933 కుటుంబాలు ఉన్నాయన్న అంచనాతో స్టిక్కరింగ్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు సంగెంలో బీఎల్‌వో, అంగన్‌వాడీ టీచర్లు స్టిక్కర్లు వేశారు. శనివారం నుంచి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. సామాజిక వివక్షను రూపు మాపేందుకు సమగ్ర సర్వే దోహదపడుతుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సర్వేపై పలు కాలనీలలో కాంగ్రెస్ నేతలతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్యుమరేటర్లకు కుటుంబ వివరాలు అందించి సహకరించాలని ఖలీల్ కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు రఫీ, సలీం, నర్సింహ, తదితరులున్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయాలి

తలకొండపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికి రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి వారి సొంతింటి కలను సాకారం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ , మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. రాంపూర్ గ్రామంలో శుక్రవారం వెంకటేశ్ పర్యటించారు. గ్రామానికి చెందినవెంకటయ్య ఇంటినిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెటీరియల్ సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. శేఖర్ యాదవ్, మోహన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, రవి, జంగయ్య, శేఖర్, తదితరులు ఉన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో త్రిశూలం ధ్వంసం

- దుండగుడికి ఆలయ సిబ్బంది, భక్తుల దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత.. శంషాబాద్ సిద్ధాంతి బస్తీలో ఘటన



దుండగుడు ధ్వంసం చేసిన త్రిశూలం, నిందితుడు

శంషాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీలోని హనుమాన్ దేవాలయంలోని నవగ్రహాలను ధ్వంసం చేసి మూడు రోజులు గడవకముందే.. శంషాబాద్ సిద్ధాంతి బస్తీలోని హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఓ దుండగుడు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన త్రిశూలాన్ని ధ్వంసం చేశాడు. ఎవరో భక్తుడు ఆలయానికి దర్శనార్థం వచ్చి త్రిశూలానికి మొక్కుతున్నాడని ఆలయ సిబ్బందితో పాటు అక్కడున్న భక్తులు భావించారు. అయితే, ఉన్నట్టుండి అతడు త్రిశూలాన్ని కాలితో తన్ని ధ్వంసం చేశాడు. ఈ సంఘటన చూసి నివ్వరపోయిన భక్తులు, ఆలయ సిబ్బంది వెంటనే ఆ వ్యక్తిని పట్టుకొని ఎందుకు దాడి చేశావని ప్రశ్నించారు. దాంతో అమ్మ చెప్పింది.. అందుకే చేశానని పొంతనలేని సమాధానాలు చెప్పాడని భక్తులు తెలిపారు. అయితే, అతడితో మాట్లాడే ఓపిక లేక భక్తులు, ఆలయ సిబ్బంది దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలో ధ్వంసమైన నవగ్రహాలను చూసేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ వస్తుండటంతో శంషాబాద్ ఏసీపీ కేఎస్ రావు నేతృత్వంతో సైబరాబాద్‌లోని పోలీసుస్టేషన్లకు చెందిన సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే సమయంలో సిద్ధాంతి బస్తీలోని కట్టమైసమ్మ దేవాలయంలో ఈ ఘటన జరిగిందని సమాచారం తెలియడంతో పోలీసులు అక్కడికి పరుగుపెట్టారు. అయితే, అప్పటికే దుండగుడిని భక్తులు పట్టించడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆ యువకుడు ఎక్కడివాడు? త్రిశూలాన్ని ఎందుకు ధ్వంసం చేశాడు? బండి సంజయ్ వస్తున్న తరుణంలోనే ఇలా ఎందుకు దాడికి పాల్పడ్డాడు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ సంఘటనతో శంషాబాద్‌లో మరింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పలు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను పెంచారు.

సంక్షిప్తంగా

- **తలకొండపల్లి** : మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికిచెందిన గ్రామ పంచాయతీ కార్మికురాలు కొప్పు కిష్టమ్మ ఇటీవల అనారోగ్యానికిగురైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గ్రామ నాయకుడు , ప్రముఖ సంఘ సేవకుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి శుక్రవారం కిష్టమ్మ ను పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్సల నిమిత్తం రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు ఏమిరెడ్డి రంగారెడ్డి, కొప్పు యాదయ్య తదితరులు ఉన్నారు.
- **ఆమనగల్లు** : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికిచెందిన చందు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని శుక్రవారం తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 3 వేలు సమకూర్చగా స్థానిక నాయకులు మృతుని తండ్రి కృష్ణయ్య కు అందజేశారు.పరామర్శించిన వారిలో నాయకులు శేఖర్,వెంకటయ్య, రాజు, నిరంజన్, వెంకటేశ్, మధు, శ్రీను, తదితరులు ఉన్నారు.
- **కందుకూరు** : నేడు(శనివారం) మండల కేంద్రంలో నిర్వహించనున్న సదర్ వేడుకలను విజవయంతం చేయాలని యాదవ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పసుపుల పర్వతాలు యాదవ్ కోరారు. శనివారం సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరుకావాలని కోరారు.
- **ఆమనగల్లు** : లండన్ వేదికగా జరుగుతున్న ప్రపంచ పర్యాటక సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, అనిరుధ్ రెడ్డి, రాజేశ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలతో కలిసి అక్కడి పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. పర్యాటకరంగం అభివృద్ధి గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.
- **ఆమనగల్లు** : ప్రజారోగ్య పరిరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేయాలని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. గట్టిప్పలపల్లికి చెందిన దేరంగుల హర్షవర్ధన్ అనారోగ్యంతో చికిత్స పొందాడు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.32,500 చెక్కును బాధితుడికి ఆయన అందజేశారు.

అఖిల భారత యాదవ మహాసభ నియోజకవర్గ కార్యదర్శిగా తరుణ్‌తేజ్



నియామకపత్రం అందుకుంటున్న తరుణ్‌తేజ్ యాదవ్

ఆదిభట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కార్యదర్శిగా దాయి తరుణ్‌తేజ్ యాదవ్ నియమితులయ్యారు. మహాసభ నియోజకవర్గం అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీరామ్‌యాదవ్ శుక్రవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం గ్రామానికి చెందిన తరుణ్‌తేజ్ కొన్ని సంవత్సరాలుగా యాదవ మహాసభ కేంద్రంగా గ్రామ, మండల స్థాయిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించే క్రమంలో నియోజకవర్గం కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. తరుణ్ మాట్లాడుతూ యాదవ సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన శ్రీరామ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.